

పట్టాలు ఎక్కేనా?



- కాకినాడ మెయిన్‌లైన్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై ఆశలు
- కూటమి సర్కారుతో మళ్లీ కదలిక వచ్చే అవకాశం

పిఠాపురం, జూలై 22: పోర్టుసిటీగా పేరుగాంచిన కాకినాడ నగరాన్ని మెయిన్ రైల్వేలైన్‌లో కలపాలన్నది ఈ ప్రాంతప్రజల చిరకాల వాంఛ. కానీ ఎప్పుడూ నిరాశే మిగులుతోంది. వైసీపీ అయిదేళ్ల పాలనలో దీనిగురించి నాటి ప్రజాప్రతినిధులు, అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇది కోల్డ్ స్టోరేజీలోకి వెళ్లిపోయింది. రాష్ట్రంలో మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో అందరిలో ఆశలు చిగురిస్తున్నాయి. కాకినాడ జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడ నగరాన్ని విజయవాడ-విశాఖపట్టణాల మధ్యగల ప్రధాన రైలు మార్గంలో కలపాలన్న డిమాండ్ ఉంది. ప్రస్తుతం సామర్లకోటనుంచి కాకినాడకు ప్రత్యేక రైలుమార్గం ఉంది. విజయవాడ, విశాఖ వైపు నుంచి వచ్చే ప్రయాణికులు సామర్లకోటలో దిగి కాకినాడ మార్గానికి మారాలి. దేశంలో ప్రధానమైన ప్రాంతాలకు వెళ్లే రైళ్లు కాకినాడ నుంచి లేకపోవడంతో సామర్లకోట లేదా రాజమహేంద్రవరం వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఉంది.

కాకినాడ మెయిన్‌లైన్ ప్రతిపాదన

కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్‌లోకి తీసుకువచ్చేందుకుగాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా రైలుమార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకొంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాలని ప్రతిపాదించారు. 21.5 కిలోమీటర్లు ఉండే ఈ లైనుకు తొలుత రూ.48కోట్లుఉన్న అంచనా 2014-15లో రూ.220.30 కోట్లకు చేరుకుంది. 2017-18లో ఇది రూ.400కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం పెరిగిన భూసేకరణ వ్యయంతో ఇతర రేట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది రూ.1200- 1500కోట్లకు చేరుకుంటుందని అంచనా. కేంద్రంలో ఎన్‌డీఏలో టీడీపీ భాగస్వామిగాఉన్న సమయంలో కాకినాడ మెయిన్‌రైల్వేలైనుకు 2016-17 రైల్వేబడ్జెట్‌లో రూ.50 కోట్లు, 2017- 18 బడ్జెట్‌లో రూ.150కోట్లు కేటాయించారు. ప్రాజెక్టువ్యయంలో కీలక భూసేకరణ వ్యయాన్ని భరించేందుకు అప్పటి రాష్ట్రప్రభుత్వం అంగీకారం తెలిపింది. సమగ్ర సర్వేతోపాటు అంచనాలు రూపొందించిన తర్వాత వైసీపీ అధికారంలోకి రావడం, భూసేకరణపై వెనక్కితగ్గడంతో ప్రతిపాదనలు అటకెక్కాయి.

ప్రయోజనాలు ఎన్నో...

కాకినాడలో పోర్టుతోపాటు పలు పరిశ్రమలు ఉన్నాయి. పెట్రో కారిడార్ ఈ ప్రాంతం మీదుగా వెళ్లడంతోపాటు కాకినాడ సెజ్‌లో పలు పరిశ్రమలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో కాకినాడను కలపడం ద్వారా రైల్వే ద్వారా ఈ ఎగుమతులు, దిగుమతులు మరింత పెరగడంతోపాటు వాణిజ్య, వ్యాపారవర్గాల అవసరాలకు అనువుగా ఉంటుంది. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలతో కూడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో మళ్లీ టీడీపీ భాగస్వామిగా చేరిన నేపథ్యంలో కాకినాడ మెయిన్ రైల్వేలైన్‌పై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు జరుగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.



నిర్మలమ్మా.. నిధులివ్వమ్మా!

నేటి పద్దులోనైనా పైసలిస్తారా..



- నేడే కేంద్ర వార్షిక బడ్జెట్
- మూడోసారి నిర్మలమ్మ పద్దు
- జిల్లాకు ఈసారైనా న్యాయం జరిగేనా
- వెక్కిరిస్తున్న విభజన హామీలు
- రూ.300 కోట్ల పెట్టుబడుల మాటేంటి
- ఐపీ, ఐఐఎఫ్‌టీకి అప్పట్లో ప్రకటన
- ఇప్పటికీ పట్టాలెక్కని ఇన్‌స్టిట్యూట్స్
- సెజ్‌లో ఖాళీగా మారిన భూమి
- తాత్కాలిక భవనంలోనే ఐఐఎఫ్‌టీ
- పదేళ్లలో కేటాయింపు రూ.20 కోట్లే
- కలగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- పదేళ్లుగా పట్టించుకోని వైనం
- కేంద్రంలో కీలకంగా కూటమి
- సహకరిస్తే మారనున్న దశ దిశ

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు రెండు కాదు.. పదేళ్ల నుంచీ నిరీక్షణ.. విభజన హామీలు అమలుకు నోచుకుంటాయని.. జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని.. కానీ ఎప్పటికప్పుడు అదే రిక్తహస్తం.. వినిపించుకోని వినతులు.. పట్టాలెక్కని ప్రాజెక్టులు.. కంటి తుడుపుగానైనా కాణీ కూడా ఇవ్వని బడ్జెట్ పద్దులతో ప్రతిసారీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నష్టపోతూనే ఉంది.. అయినా పదేళ్ల నుంచీ ఎదురుచూపులు చూస్తూనే ఉంది. అయితే మూడోసారి వరుసగా గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెన్నెముకగా మారిన నేపథ్యంలో ఈ పద్దులోనైనా జిల్లాకు మేలు జరుగుతుందా అనే ఆశలు అందరిలో నెలకొన్నాయి. విభజన సమయంలో ఇచ్చిన హామీలకు ఈసారైనా న్యాయం జరుగుతుందా అని అంతా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా 2014లో అప్పట్లో విభజన హామీల కింద కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లు రూ.300 కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అయితే ఇప్పటికీ అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఒక్క ఫారన్ ట్రేడ్ క్యాంపస్ మాత్రం ఏదో మొక్కుబడిగా జేఎన్టీయూకేలో తాత్కాలిక భవనంలో నడుస్తోంది. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో అయినా నిధులిచ్చి మోక్షం కల్పించాల్సిన అవసరం ఉంది.

భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ వచ్చేనా?

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అందులో భాగంగా 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటుచేయడానికి గెయిల్-హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలు ఎక్కించడానికి గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. చమురు కంపెనీల ఇంజనీర్లు వచ్చి సెజ్ భూమి నాణ్యత పరీక్షించి పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువుగా ఉందని తేల్చారు. తర్వాత పనులు ప్రారంభించేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఒత్తిడి తెచ్చారు. పైగా అప్పట్లో రాష్ట్రంలో కేంద్రానికి భాగస్వామ్యం ఉండడంతో అనుమతి పనులు చకచకా ముందుకు కదిలాయి. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధి పొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రానికి విన్నవించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది. కానీ ఈలోపు రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో విషయం మళ్లీ మొదటికొచ్చింది. తర్వాత పెట్రో కాంప్లెక్స్ విషయమై జగన్ సర్కారు కేంద్రాన్ని నిలదీయలేక ఐదేళ్లు పట్టించుకోలేదు. తాజాగా రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి ఫైళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు దుమ్ము దులిపించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు కదిలేలా పావులు కదపడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కేంద్రం బడ్జెట్ పద్దులో దీనికి సంబంధించి కీలక ప్రకటన చేస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దశ, దిశ మారనుంది. పైగా ప్రస్తుతం కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నేపథ్యంలో నిర్మలమ్మ పద్దులో దీన్ని పట్టించుకుని పట్టాలెక్కిస్తారా? లేదా? అన్నది చూడాలి. అటు వేతన జీవులు సైతం ఈ బడ్జెట్‌లో మేలు చేసే నిర్ణయాలు ఉంటాయేమోనని ఎదురుచూస్తున్నారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచితే పెరిగిన ధరాభారాన్ని ఎంతో కొంత తట్టుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు సైతం పెంచుతారనే చర్చ జరుగుతోంది.

మాటలే..మూటల్లేవు..

ఏటా కేంద్రం ప్రవేశపెడుతున్న వార్షిక బడ్జెట్‌లో జిల్లాలో కీలక ప్రాజెక్టులకు నిధులు విడుదలవుతాయనకుంటే ప్రతిసారీ రిక్తహస్తమే. విభజన సమయంలో జిల్లాకు ప్రకటించిన ఏ ప్రాజెక్టును కేంద్రం పట్టించుకోవడం లేదు. అసలు వాటి ఉనికినే పక్కనపడేసింది. ప్రధానంగా రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. అందులో భాగంగా కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఒక్కో దానికి రూ.150 కోట్లు ఇస్తామని మాట ఇచ్చింది. తద్వారా ఈ రెండు క్యాంపస్‌ల రాకతో అటు యువతకు ఉద్యోగావకాశాలు, పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అంతా భావించారు. దీనికి తగ్గట్టే 2014 తర్వాత ఈ రెండింటికీ అప్పటి బడ్జెట్‌లో కేంద్రం చెరో రూ.10 కోట్లు కేటాయించింది. ఈ రెండు క్యాంపస్‌లు చాలా వేగంగా అందుబాటులోకి వస్తాయని అంతా భావించారు. ఎలాగూ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడంతో అప్పట్లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో ఈ రెండు విద్యాసంస్థల ఏర్పాటుకు 50 ఎకరాలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కేంద్రం వీటి ఊసే మర్చిపోయింది. పదేళ్లగా కేంద్రం బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా విదల్చడం మానేసింది. గతేడాది అతికష్టంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్‌ను తాత్కాలికంగా కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటుచేశారు. ఈ బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయిస్తే సమస్యలు తీరే అవకాశం ఉంది. కొత్త క్యాంపస్‌లకు శాశ్వత భవనాలు సమకూరేలా కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది. గతేడాది కాకినాడకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జేఎన్టీయూలో తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభించడం విశేషం. ఈ నేపథ్యంలో వీటికి నిధులు కేటాయించాలని అంతా కోరుతున్నారు.

ప్రతి అర్జీని సంతృప్తికరంగా పరిష్కరించాలి

- కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 22: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే ప్రతిఅర్జీని సంతృప్తికంగా పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై 221 అర్జీలను స్వీకరించామన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛత వారోత్సవాలు సోమవారం ఆరంభమయ్యాయని, వారంరోజులపాటు జరుగుతాయన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, కుడా వీసీ కృష్ణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, డీపీవో భారతి సౌజన్య, సీపీవో త్రినాథ్, గృహనిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హమైన ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం

- పిఠాపురం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్
- వివిధ సమస్యలపై 506 వినతులు



పిఠాపురంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్లు

పిఠాపురం,జూలై 22: ప్రజల నుంచి ప్రతి అర్హమైన అర్జీని సత్వరం పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ సగిలి తెలిపారు. పిఠాపురం పట్టణంలోని రథాలపేట సెంటర్‌లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఉదయంనుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురుస్తున్నా పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి అర్జీదారులు పోటెత్తారు. పింఛన్ల మంజూరు, భూమిరికార్డులు ఆన్‌లైన్, ఇళ్లస్థలాలు, టిడ్కో గృహాలు అప్పగించకపోవడం, డ్రైన్‌లు, కాలువల్లో పూడికలు తొలగించక ఇబ్బందులు తదితర అంశాలపై 506 వినతులు అందాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనల మేరకు ప్రతి రెండువారాలకు ఒకసారి పిఠాపురంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల వినతులను సత్వరం పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేకంగా అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తున్నామని తెలిపారు. అర్జీలపై ప్రగతిని ఇకనుంచి ప్రతి శనివారం సమీక్షిస్తామని చెప్పారు. నిధులు, ఆర్థిక, విధానపరమైన నిర్ణయాలతో కూడిన విషయాల పరిష్కారంకోసం అనుమతులు కోరి పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే కొత్త పించన్లు మంజూరు చేస్తామని తెలిపారు. టిడ్కో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఐదేళ్లు పూర్తయ్యాయని, తాము డబ్బులు చెల్లించి 8ఏళ్లు దాటుతున్నా ఇప్పటివరకూ తమకు గృహాలు అప్పగించలేదని, కానీ రుణవాయిదాలు చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయని పలువురు కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు. పిఠాపురంలోని 2,3,4 వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న సమయంలో ఉపాధ్యాయులు తనను కొట్టడంతో అనారోగ్యానికి గురయ్యానని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన అమృత ఫిర్యాదు చేసింది. పిఠాపురం పురపాలక సంఘంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియమాకంలో అక్రమాలు జరిగాయని మున్సిపల్ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. పక్షవాతంతో కాళ్లు పనిచేయడం లేదని, తనకు దివ్యాంగ పింఛన్ ఇవ్వాలని పిఠాపురంలోని కత్తుల గూడెం ప్రాంతానికి చెందిన జొన్నకూటి సూర్యాకాంతం కోరారు.కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా ఉపాధి శిక్షణాధికారి శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు నారాయణమూర్తి, ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్లు కనకారావు, రవికుమార్, తహసీల్దార్లు కె.లక్ష్మి, ఉదయభాస్కర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేకుండా...

- విడువకుండా కురుస్తూనే ఉన్నవాన
- పల్లపు ప్రాంతాల్లో రహదారులు మునక
- మెట్టప్రాంతాల్లో పొలాల్లో వర్షపునీరు
- మరో రెండు, మూడు రోజులు వర్షాలు



కాకినాడ నగరంలో కురుస్తున్న వర్షం

తుని రూరల్, జూలై 22: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లు ఛిద్రమవడంతోపాటు ప్రజలు బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. పొలాలు మునిగి రైతులు ఇబ్బందిపడుతున్నారు. వరిసాగుతోపాటు కూరగాయలు, ప్రత్తిపంటలు ముంపునకు గురవుతున్నాయి. మరో రెండు, మూడురోజులపాటు వర్షాలు ఇలా పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తుని రూరల్ చామవరం, హంసవరం, గవరపేట తదితర గ్రామాల్లో పత్తి, కూరగాయల పంటలు ముంపునకు గురవడంతో వ్యవసాయాధికారులు పలు సూచనలు ఇచ్చారు.



తుని మండలం చామవరం వద్ద నీట మునిగిన కూరగాయల పంటలు

ఎన్వీనగరంలో కూలిపోయిన ఇంటి గోడలు

రౌతులపూడి, జూలై 22: వర్షాల కారణంగా ఎన్ఎన్‌పట్నం గ్రామశివారు ఎన్వీనగరంలో రెండు పెంకిటిళ్ల గోడలు కూలిపోయాయి. వర్షాల కు గృహాలు గోడలు నానిపోవడంతో సోమవారం గదుల అప్పారావు, మువ్వల బాబురావు చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి.



ఎన్వీనగరంలో కూలిపోయిన ఇంటిగోడ

కూలిన పెంకుటిల్లు

ప్రత్తిపాడు, జూలై 22: మండలంలో వారంరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ధర్మవరంలోని దళితవాడలో సోమవారం సింగులూరి మహాలక్ష్మి, రాపావాడపల్లికి చెందిన పెంకుటిల్లు పాక్షికంగా కుప్పకూలాయి. విరామంలేకుండా కురుస్తున్న ఈ వర్షాలవల్ల పెంకుటిల్లు పైకప్పు, గోడలు దెబ్బతిని కుప్పకూలడంతో బాధిత కుటుంబీకులు భయాందోళనకు గురయ్యారు. నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వి.నారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ధర్మవరం వీఆర్వో రాజేష్ రెండు పెంకుటిళ్లను పరిశీలించారు.



ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో పాక్షికంగా కూలిన పెంకుటిల్లు

నేల కూలిన భారీ వృక్షం

జగ్గంపేట, జూలై 22: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జగ్గంపేట-గోకవరం రోడ్డులోని అతి భారీవృక్షం నేలకూలింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. రెండు ఎక్స్‌కవేటర్లు, కటింగ్ మిషన్లతో చెట్టును ముక్కలుగా చేసి తొలగించారు. పోలవరం కాల్వపై ఉన్న వంతెనపై గుంతలు పడడంతో వాటికి మరమ్మతులు చేయించి వాహనాలను పంపారు.



గోకవరం-జగ్గంపేట రహదారిలో నేలకూలిన భారీ వృక్షం

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: ఎస్పీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్

కాకినాడ క్రైం, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం 39మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులనుంచి సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేఈ భాస్కరరావు తోపాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జైలుశిక్ష

కాకినాడ క్రైం, జూలై 22: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వాహనదారులకు తలో రెండురోజుల జైలు శిక్షను విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్-1లో 8మంది, ట్రాఫిక్-2లో ఐదుగురు మద్యం తాగినట్లు రుజువైందన్నారు. వీరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కాకినాడ మూడోస్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టా మన్నారు. ఆరుగురు వాహనదారులకు రెండేసి రోజుల జైలు శిక్ష, ఏడుగురికి తలో రూ.10వేల చొప్పున రూ.70వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చామన్నారు.

కలెక్టరేట్‌లో స్పాన్సర్‌షిప్, ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 22: కలెక్టరేట్‌లో స్పాన్సర్‌షిప్, ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనాథ, పాక్షిక అనా థ, హెచ్ఐవీ ప్రభావిత, కొవిడ్ సెమీ ఆర్ఫాన్స్ బాలబాలికలను 417మందిని గుర్తించామన్నారు. వీరిని తాత్కాలిక ప్రాతిపదిక స్పాన్సర్షిప్ పథకానికి ఎంపిక చేశామన్నారు. ఐసీడీఎస్ ప్రవీణ, బాలల సంక్షేమ సమితి సభ్యురాలు సంతోషి, జిల్లాబాలల సంక్షేమ పరిరక్షణ అధికారి వెంకటరావు, ఉమామనోవికాస కేంద్రం ప్రతినిధి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖలో భూ ఆక్రమణలపై సమీక్షా సమావేశం

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 22: దేవదాయశాఖ కాకినాడ జిల్లా పరిధిలోని దేవాలయాలకు సంబంధించి భూ ఆక్రమణలపై డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. కాకినాడ రామారావుపేటలోని డీసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లాలోని ఆయా దేవాలయాల కార్యనిర్వహణాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11,387 ఎకరాలు దేవాలయాలకు భూములు ఉన్నాయన్నారు. దీనిలో గతంలో 10,767 ఎకరాలు అందుబాటులో ఉండగా మిగిలినవి ఆక్రమణల్లో ఉండేవని వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిలో 6221 ఎకరాలు పల్లం, 3319 ఎకరాలు మెట్ట పొలాలు ఉన్నాయని వివరించారు. 5.53 ఎకరాలు ధర్మ చెరువులు అందుబాటులో ఉన్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 550 దేవాలయాలకు సం బంధించి భూములు, సత్రాలు, షాపుల ద్వారా రూ.17కోట్ల21లక్షల33వేల687 ఆదాయం వస్తుందని వివరించారు. జిల్లావ్యాప్తంగా 1000 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని, తక్షణం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. లీజుకాలం పూర్తయిన వాటికి వేలంపాటలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీ కార్యాలయ పర్యవేక్షకుడు కె.నాగేశ్వరరావు, జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖాధికారి టీవీఎస్ సుబ్రహ్మణ్యం, తనిఖీదారు వి.ఫణీంద్ర కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

'ఏలేరు' నిండుతోంది..



ఏలేశ్వరం, జూలై 22: ఏలేరు రిజర్వాయర్‌లోకి సోమవారం ఎగువ కాలువ నుంచి 17610 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గతంలో ఎన్నడూలేని రీతిలో భారీ స్థాయిలో నీరు చేరడంతో నీటిమట్టం పెరిగింది. పురుషోత్తపట్నం పథకం నుంచి మరో 875 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 75.61 మీటర్ల స్థాయిలో 8.86 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. గత 24 గంటల వ్యవధిలో 2.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఎడమ కాలువ నుంచి విశాఖ పట్నానికి 200 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 60 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది.

'తాండవ' పొంగుతోంది..




కోటనందూరు,జూలై22: ఎగువ ప్రాంతంలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్ నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతమైన గొలుగుండ మండలంలోని బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగు గెడ్డ లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. వారం రోజులకు ముందు కేవలం కనిష్ఠ నీటిమట్టానికే ఉన్న రిజర్వాయర్ వారం రోజుల వ్యవధిలో సుమారు 13 అడుగులు మేర పెరిగి సోమవారం నాటికి 369 అడుగులుగా నమోదైనట్లు డీఈ అనురాధ తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2300 క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని చెప్పారు.

నిండు కుండలా 'భూపతిపాలెం'



రంపచోడవరం, జూలై 22: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూపతిపాలెం జలాశయం నిండు కుండలా మారింది. కొండ కాలువల నుంచి జలాశయానికి నీరు చేరడంతో అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని ముసురుమిల్లి జలాశయానికి వదిలారు.



కూనవరం వద్ద బ్రిడ్జి ఆనుకుని ప్రవహిస్తున్న శబరినది

గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది..అంతకంతకూ ఉధృతి పెరుగుతోంది..భద్రాచలం వద్ద ప్రమాదకర స్థితిలో గోదావరి ప్రవాహం ఉంది. ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విలీన మండలాలైన చింతూరు, ఎటపాక, వరరామచంద్రపురం, కూనవరంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మరోవైపు ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం పెరగడంతో దిగువకు లక్షలాది క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల వైపు నీరు చేరుతోంది...

వరద గోదారి

వణుకుతున్న పరివాహక ప్రాంతాలు



పునరావాస కేంద్రంలోనే వంట



కలెక్టర్ దినేష్ పర్యటన

చింతూరు, జూలై 22: శబరి దోబూచులాడుతోంది. తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. ఇక భద్రాచలంలో గోదావరి పెరుగుతూనే ఉంది. దీంతో ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో వందకు పైగా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వారంతా నిత్యావసర సరుకుల కోసం అవస్థలు పడుతున్నారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం ఆదివారం రాత్రికి 39.5 అడుగులకు చేరింది. కాగా సోమవారం ఉదయానికి ఒక్క అడుగు తగ్గి 38.5 అడుగులకు చేరుకుంది. దీంతో ముంపు ప్రాంత వాసులు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు. కానీ సోమవారం సాయంత్రం నుంచి తిరిగి శబరి నది పెరగడం మొదలైంది. దీంతో సోమవారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం తిరిగి 39 అడుగులకు చేరుకుంది. ఇక భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 49 అడుగులకు చేరుకుంది. దీంతో అక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద స్థాయి మరింత పెరిగే అవకాశం ఉందంటూ అధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంతో పాటు ఒడిసాలో కూడా విస్తారంగా వర్షం కురుస్తున్న క్రమంలో సీలేరు జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. దీంతో డ్యాం గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేసే పరిస్థితి ఏర్పడనుందని డొంకరాయి కార్యనిర్వాహక ఇంజనీరు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ ఒక్కరూ సీలేరు నది మీదుగా దాటే ప్రయత్నం చేయవద్దని, పశువులను కూడా ఆ వైపు వెళ్లకుండా చూసుకోవాలని డొంకరాయి జలాశయ కేంద్రం దిగువ గ్రామస్థులకు సూచనలిచ్చారు. దీంతో ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరరామచంద్రపురం, చింతూరు మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు చింతూరు మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ రాష్ట్రాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు రోజులుగా చింతూరు మండలం చట్టి వద్ద లారీలు ఇతరత్రా వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో వారంతా వాహనాల్లోనే వంటలు చేసుకుంటున్నారు. పలు కుటుంబాలు స్వచ్ఛందంగా కర్రలతో పూరిపాకలు వేసుకుని పునరావాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. వారంతా తమకు టార్పాలిన్లు, కొవ్వొత్తులు, దోమతెరలతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సమకూర్చాలని కోరుతున్నారు. దోమల బెడద మరింత ఎక్కువగా ఉందంటూ వారంతా వాపోతున్నారు. పలు ముంపు గ్రామాలకు నాటు పడవలు సమకూర్చాలని కోరుతున్నారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరడంతో పలు వాహనాలు చిక్కుకున్నాయి. దీంతో ఆయా వాహనాలను పోలీసు శాఖ ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా రహదారుల వెంబడి ప్రయాణాలను పోలీసులు పూర్తిగా నిషేధించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే బృందం విలీన మండలాల్లో పర్యటించి బాధితుల అవసరాలను తెలుసుకున్నారు.

వాగుల ఉధృతి



వెలగపల్లి-దొనలంక మధ్య పొంగిన వాగు

దేవీపట్నం, జూలై 22: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శబరి, కిన్నెరసాని నదులు పొంగి ప్రవహించడంతో గోదావరి నదికి వరదనీరు చేరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాదక హెచ్చరిక జారీ చేయడంతో ప్రవాహం మరింత ఎక్కువైంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఆదివారం సాయంత్రం గోపురం వరకు చేరిన వరద నీరు సోమవారం మరింత పెరగడంతో పూర్తిగా మునిగిపోయింది. ఎడతెరిపి లేని వర్షం కురవడంతో సీతపల్లి, వెలగపల్లి, దోనలంక తదితర వాగులు పొంగి ప్రవహించాయి.

వరద భయం



ఎటపాక మండలంలో పునరావాస కేంద్రాలకు తరలిపోతూ..

ఎటపాక, జూలై 22: భద్రాచలం-కూనవరం రహదారిని వరద ముంచెత్తింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూరుమూరు- పోలిపాక గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించింది. దాంతో అర్ధరాత్రి నుంచి భద్రాచలం- కూనవరానికి వాహన రాకపోకలు స్తంభించాయి. అలాగే నందిగామ, మురుమూరు, గౌరిదేవిపేట, నెల్లిపాక, వీరాయిగూడెం, నల్లకుంట గ్రామాల వద్ద ప్రధాన రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. వీరాయిగూడెం- నెల్లిపాక గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించడంతో వీరాయిగూడెం గ్రామ గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లగూడెం, గన్నవరం గ్రామాల్లోని ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. నెల్లిపాక, రాయనపేట వద్ద గోదావరి వరదను టీడీపీ రాష్ట్ర నాయకులు జమాల్‌ఖాన్ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్‌తో కలిసి పరిశీలించారు.



పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో నీటమునిగిన మిర్చి

ప్రతి గంటకు సమాచారమందిస్తాం

- అప్రమత్తంగా ఉండండి
- అధికార యంత్రాంగం అండగా ఉంటుంది
- పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పిస్తాం
- నిత్యావసర సరుకులు అందిస్తాం
- అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 22: వరద తీవ్రతపై బాధిత గ్రామాలకు గంట గంటకూ సమాచారం అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. విలీన మండలాల్లోని ముంపు ప్రభావిత గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం చింతూరులో పత్రికా ప్రకటన విడుదల చేశారు. గోదావరి, శబరి నదులు వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. విలీన మండలాల్లో 177 గ్రామాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఉందన్నారు. చింతూరు, డొంకరాయితో పాటు భద్రాచలానికి చెందిన సెంట్రల్ వాటర్ కమిషన్ ద్వారా వరద హెచ్చరికలను జారీ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే భద్రాచలంలో గోదావరి నది 49 అడుగుల మేర ప్రవహిస్తుండడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారన్నారు. విలీన మండలాల్లో 149 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐటీడీఏ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా బాధితులకు బియ్యం, కందిపప్పు, పామాయిల్, కూరగాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 44 బోట్లను అందుబాటులో ఉంచామని, 4600 లీటర్ల కిరోసిన్ సరఫరా చేసినట్లు చెప్పారు. ప్రతి పడవకు 12 లైఫ్ జాకెట్లు అందించామన్నారు. వైద్యశాఖను అప్రమత్తం చేశామన్నారు. శానిటేషన్ పనులు కూడా ప్రారంభించామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



పి.గన్నవరం:గంటిపెదపూడిలో లంక గ్రామస్తుల ఇబ్బందులు



పి.గన్నవరం: గంటిపెదపూడిలో ఇంజన్ బోటుపై రాకపోకలు

సుద్దగడ్డకు పోటెత్తిన వరద నీరు



గొల్లప్రోలు పట్టణ శివారులో రోడ్డుపై సుద్దగడ్డ నీరు

గొల్లప్రోలు, జూలై 22: ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలతో సుద్దగడ్డకు వరద నీరు పోటెత్తింది. సోమవారం గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ)కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున ప్రవహిస్తున్నది. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో వరద నీరు స్వల్పంగా ఉండిపోవడంతో ఇదే మార్గంలో వెళ్లిన విద్యార్థులు తిరిగి కాలనీకి చేరేందుకు అవస్థలు పడ్డారు. పంటపొలాలు మీదుగా రాకపోకలు సాగించారు. మరోవైపు వరదనీట మునిగిన రహదారిపై భారీ గోతులు పడటంతో నీటిని దాటేందుకు కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపైకి సుద్దగడ్డ వరద నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ సుద్దగడ్డ వరద ఉధృతి పెరుగుతుండటంతో పట్టణంలోని ఈబీసీ, ఎస్సీ, అరుంధతీయ కాలనీ వాసులు, దేవీనగర్, కంకరరేవడ్లు తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గొల్లప్రోలు జగనన్న కాలనీ రహదారిపై వరద పరిస్థితిని తహసీల్దారు ఉదయభాస్కర్, ఎస్ఐ జానీబాషా పరిశీలించారు. జనసేన నాయకులు పర్యటించారు.

భయం గుప్పెట్లో..

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు
- లంక గ్రామాల వైపు వరద నీరు..



ధవళేశ్వరం, జూలై 22: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో అంతకంతకు పెరుగుతున్న గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 7 గంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 11.77 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10 లక్షల క్యూసెక్కులు పైబడి వరదనీరు దిగువకు ప్రవహించింది. సరాసరి గంటకు 15 వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరగ్గా నీటి మట్టం 2 పాయింట్లు చొప్పున పెరుగుతోంది. రాత్రి 12 గంటలకు నీటి మట్టం 13.60 అడుగులుగా నమోదు కాగా 12,68,958 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి(13.75 అడుగులు)కి చేరవచ్చని అధికారుల అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి రాత్రి 12గంటల సమయంలో 50.20 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 5 గంటల నుంచి పెరుగుదల కొంత నెమ్మదించినా తాలిపేరు నుంచి వచ్చిన వరదనీటితో మరలా నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. దిగువన శబరి పరివాహకం నుంచి వస్తున్న వరదనీరు నెమ్మదించడంతో కుంట వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టింది.

● ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువన కాళేశ్వరం వద్ద నీటి మట్టం 12.390 మీటర్లు వరకు పెరిగి నిలకడగా కొనసాగుతుండగా పేరూరు వద్ద 17.260 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.470 మీటర్లు, భద్రాచలం వద్ద 49.40 అడుగులు, కూనవరం వద్ద 20.190 మీటర్లు నీటి మట్టం పెరుగుతుండగా కుంట వద్ద 13.30 మీటర్లకు పెరిగిన నీటి మట్టం తగ్గుముఖం పట్టి 12.500 మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద నీటి మట్టం 12.900 మీటర్లకు చేరి పెరుగుతుండగా రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.390 మీటర్లుగా నమోదయింది.

నీట మునిగిన ఇసుక నావ

ధవళేశ్వరం, జూలై 22: వరద ఉధృతికి గాయత్రి ఇసుక ర్యాంప్ నుంచి కొట్టుకు వచ్చిన నావ కాటన్ బ్యారేజ్ 1వ గేటు వద్ద మునిగిపోగా నావను గేటు వద్ద నుంచి బయటకు తీయడానికి ఆదివారం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చీకటి పడడంతో పనులు నిలిపివేశారు. సోమవారం గోదావరి వరద ఉధృతి పెరగడంతో నావ పూర్తిగా నీట మునిగింది. గోదావరి నీటి మట్టం తగ్గిన తర్వాత నావను బయటకు తీసే పనులు చేపట్టనున్నారు.



ఆత్రేయపురం:వాడపల్లి పుష్కర ఘాట్‌ను ముంచెత్తిన వరదనీరు



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సూచనలిస్తున్న కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

● ముమ్మిడివరం

పాపం తాళ్లూరు వాసులు..



కొండలపైకి వెళ్లిపోతున్న తాళ్లూరు వాసులు

రంపచోడవరం, జూలై22: గోదావరికి వరద నీరు పోటెత్తడంతో దేవీపట్నం మండలం తాళ్లూరు గిరిజనులు కొండలపై తలదాచుకుంటున్నారు. అనేక కుటుంబాలు వరదలకు ముందే తమ బంధువుల ఇళ్లకో, ఇతర ప్రాంతాలకో తరలిపోగా సుమారు 10 కుటుంబాల గిరిజనులు గ్రామంలోనే ఉండిపోయి వరద పెరగడంతో గతంలో కొండలపై ఏర్పాటు చేసుకున్న తాటాకుపాకలకు తరలివెళ్లారు. ఈ గ్రామం కొండ మొదలు పంచాయతీ పరిధిలోని 11 గ్రామాల్లో ఒకటి కాగా, గతంలో ఈ పంచాయతీలోని 10 గ్రామాలకు మాత్రమే చట్ట ప్రకారం పునరావాస చర్యలను అమలు చేసేందుకు అధికారులు ఒప్పందం కుదుర్చుకోగా, ఈ ఒక్క గ్రామాన్ని అధికారులు నిర్లక్ష్యం చేశారు. కనీసం ఈ గ్రామంలోని నిర్వాసితులు కోరుకున్న చోట పునరావాస కాలనీని నిర్మించకపోగా, పొమ్మనకుండా పొగపెట్టిన చందంగా ఈ గ్రామాన్ని వరదలకు వదిలేస్తూ వచ్చారు. అధికారులు కోరుకున్నట్టుగానే వారి నిర్లక్ష్యాన్ని తట్టుకోలేని గిరిజనులు పునరావాసం అందకపోయినా క్రమేణా గ్రామాన్ని వదిలి వచ్చేస్తున్నారు. ఈ విధంగా వచ్చేయగా ఇంకా 10 కుటుంబాల నిర్వాసిత గిరిజనులు గ్రామంలోనే ఉండిపోయి వరద బాధితులుగా మారారు. గ్రామాన్ని వరద చుట్టేయడంతో తమ నాటుపడవల సాయంతో కొండలపైకి చేరుకున్నారు.

జల దిగ్బంధంలో 46 గ్రామాలు



కోతులుగుట్ట పునరావాస కేంద్రంలో బాధితులు

కూనవరం, జూలై 22: ఒక వైపు వాన... మరో వైపు వరద.. ఎదురుగా ఉగ్రరూపం దాల్చిన శబరి గోదావరి ప్రవాహం.. వీటితో కూనవరం మండల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా వరద పెరుగుతూ వస్తుండడంతో పునరావాసం వైపు పరుగులు తీశారు. దీంతో కూనవరం ఖాళీ అయింది. గ్రామాన్ని విడిచి వరద బాధితులు కోతులగుట్ట, ఫారెస్టు ఆఫీసుతో పాటు పక్క గ్రామాలకు పునరావాసాలకు తరలివెళ్లి పోయారు. ఒక్క ఏపీఆర్ పాఠశాలలోనే సుమారు 400 దళిత కుటుంబాలు తలదాచుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన కురుస్తుండడంతో చంటి బిడ్డలను పట్టుకుని పునరావాసానికి వెళ్లిపోయారు.శబరికొత్తగూడెం, కూనవరంలోని ఉదయ భాస్కర్‌కాలనీ, గిన్నెల బజారు గ్రామాలు నీట మునిగాయి. మండలంలో సుమారు 46 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలానికి పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని ఒక గ్రామం నుంచి ప్రజలు మరో గ్రామానికి వెళ్లాలంటే రోడ్లపై వరదనీరు చేరడంతో పక్కనే ఉన్న అడవుల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. దీంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోజంతా ముసురుండడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మండలంలో పర్యటించి పరిస్థితులు సమీక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ ముంపు మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. కూనవరం మండలానికి సంబంధించి చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య కృష్ణ పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. గ్రామాల చుట్టూ నీరు చేరడంతో తెలంగాణ నుంచి నిత్యావసర సరుకులు, కూరగాయలు దిగుమతి చేసుకోలేకపోతున్నామని దీనికి గాను భద్రాచలం వెళ్లేందుకు బోదునూరు అడవి గుండా ఏడుగురాళ్లపల్లి మీదుగా ఉన్న రహదారికి తక్షణమే మరమ్మతులు చేయించాలని టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి వెంటనే స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రిజర్వు ఫారెస్టులో ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు పర్యవేక్షించాలని స్థానిక అటవీశాఖాధికారి మోహినీవిజయలక్ష్మికి సూచించారు. మరోవైపు పునరావాస కేంద్రంతో పాటు జలమార్గంలో ఉన్న గ్రామాల్లో సైతం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ తెలిపారు. తక్షణమే వారికి కిరోసిన్, కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలతో పాటు టార్పాలిన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్-2024

తుది దశ కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 22: ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు సంబంధించి ఎంపీసీ విభాగం అభ్యర్థులకు తుది దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలి దశ వెబ్ కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ సోమవారం జారీ చేశారు. ఈనెల 25వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు చేసుకోవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురం ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రిన్సిపాల్ జనార్దన్‌రావు తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలి. 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నెంబర్లకు కూడా ఫోన్ చేయవచ్చు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తుంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి 2022 నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతిఏటా అమలు చేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు,
- రిజిస్ట్రేషన్: ఈనెల 23 నుంచి 25 వరకూ.
- అప్‌లోడెడ్ ధ్రువపత్రాల పరిశీలన: ఈనెల 26 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఈనెల 24 నుంచి 26 వరకూ..
- ఆప్షన్ల మార్పు: ఈనెల 27
- సీట్ల కేటాయింపు: ఈనెల 30
- సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలల్లో రిపోర్టింగ్: ఈనెల 31 నుంచి ఆగస్టు 3 వరకూ..

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి. మొదటి దశ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు మాత్రమే షెడ్యూల్‌లో పేర్కొన్నవన్నీ చేయాలి. ఆ విధంగా కాకుండా తొలిదశలో సీటు పొంది తుది దశకు కూడా ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు కేవలం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుంటే సరిపోతుంది. తొలి దశలో పొందిన సీటు తుదిదశలో సంబంధిత విద్యార్థికి సీటు కేటాయింపు జరిగిన వెంటనే రద్దవుతుంది.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.28.80 లక్షలు

మామిడికుదురు, జూలై 22: అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.28,80,990 వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 54 రోజులుకు గాను హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించగా 1.500 మిల్లీగ్రాముల బంగారం 93 గ్రాముల వెండి వచ్చిందని ఏసీ తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ దూనబోయిన నాగమల్లేశ్వరరావు ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు సామర్లకోటలో కలెక్టర్ పర్యటన

సామర్లకోట, జూలై 22: సామర్లకోట మండలం, పట్టణంలలో పలు ప్రాంతాలను మంగళవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటించనున్నట్టు సామర్లకోట రెవెన్యూ అధికారులు తెలిపారు. అచ్చంపేట, ఉండూరు, సామర్లకోట, వేట్లపాలెంలో నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఉండూరు హైస్కూల్‌లు, ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఆయన సందర్శిస్తారు.

ఏవినగరం పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సర్టిఫికెట్



తొండంగి, జూలై 22: మండలంలో ఏవినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సర్టిఫికెట్‌కు ఎంపికైంది. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రబృందం ఈ నెల 9న వివిధ జిల్లాల్లోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సర్టిఫికేషన్ నిమిత్తం పరిశీలించింది. దీనిలో భాగంగా డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ముత్తులక్ష్మి బృందం జిల్లాలో ఏవినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. 6 ప్రధాన అంశాలు ప్రాతిపదికగా 42 అంశాల్లో ఆరోగ్యకేంద్రం ప్రగతి, పనితీరును పరిశీలించి 88.08 శాతం స్కోర్ ఇచ్చారు. దీంతో ఈ ఆరోగ్యకేంద్రం నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల ఈ ఆరోగ్యకేంద్రం పరిధిలో గల కొమ్మనాపల్లిలో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురికాగా గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించారు. వీటన్నిటిని కేంద్రబృందం పరిగణనలోకి తీసుకుంది. ఏవినగరం వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషితో దీనిని సొంతం చేసుకున్నారు. జాతీయస్థాయిలో సర్టిఫికెట్ పొందిన ఆరోగ్యకేంద్రాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులు విడుదల చేయనుంది. ఉత్తమ సేవల ద్వారా సర్టిఫికెట్ సాధించిన వైద్యులు, సిబ్బందిని ఎమ్మెల్యే యనమల దివ్య అభినందించారు.

కాకినాడ ఇన్‌చార్జి ఏడీఏగా రత్నప్రశాంతి



రత్నప్రశాంతి

సామర్లకోట, జూలై 22: కాకినాడ వ్యవసాయ ఇన్‌చార్జి సహాయ సంచాలకురాలిగా రత్నప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఏడీఏగా పనిచేసిన జీవీ పద్మశ్రీ డిప్యూటేషన్‌పై విశాఖ జిల్లాకు బదిలీకావడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేం దుకు కాకినాడ వ్యవసాయ లాబ్, సామర్లకోట బీఎఫ్ఎల్ ల్యాబ్‌లకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్‌గా రత్నప్రశాంతి వ్యవహరిస్తుండడంతో కాకినాడ ఏడీఏ ఇంచార్జి బాధ్య తలను అప్పగిస్తూ జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ ఆదేశాల మేరకు రత్నప్రశాంతి బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ, సామర్లకోట మండలాల వ్యవసా యాధికారులు, తదితర వ్యవసాయ సిబ్బంది రత్నప్రశాంతిని అభినందించారు. సామర్లకోట మండలంలోని ఏడీబీ రోడ్డు వెంబడి వరిపొలాలను, వేట్లపాలెం, వెంకట కృష్ణరాయపురం ప్రాంతాల్లో నీటమునిగిన వరిపొలాలను కాకినాడ ఇన్‌చార్జి ఏడీఏ రత్నప్రశాంతి, సామర్లకోట ఎంఏవో ఐ.సత్య సిబ్బందితో కలిసి పరిశీలించారు.

'నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు'

సర్పవరం జంక్షన్, జూలై 22: నిత్యావసర ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజలకు తక్కువ ధరలకు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పులను సద్వినియోగం చేసుకోవాలని తూనికలు-కొలతలు అసిస్టెంట్ కంట్రోలర్ సలీం, ఇన్‌స్పెక్టర్ సరోజిలు కోరారు. సోమవారం సర్పవరం జంక్షన్ సమీపంలో గల స్పెన్సర్స్ ఔట్‌లెట్‌లో సివిల్ సప్లయిస్, వినియోగదారుల సమాఖ్య జాయింట్ సెక్రటరీ కె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆహార పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. తక్కువ ధరలకే నాణ్యమైన బీపీటీ బియ్యం కిలో 49, పచ్చిసోనా మసూరి బీపీటీ రూ.48, దేశవాళీ కందిపప్పు రూ.169కు ప్రభుత్వం పలు ఔట్‌లెట్స్‌లో అందిస్తుందన్నారు. సివిల్ సప్లయిస్ విజిలెన్స్ ఆఫీసర్ అపర్ణ ఉన్నారు.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'

ప్రత్తిపాడు, జూలై 22: పాఠశాలలో ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాన్ని పెంపొందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు కోరారు. మండలంలోని ఒమ్మంగి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో నిబిడీ కృతమైన సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వై.వెంకన్న సారథ్యంలో టీఎల్ఎం ప్రదర్శనను వారు పరిశీలించి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాంజీ ప్రసాద్, ప్రకాష్, కె.పెద్దబ్బాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ముందంజలో లయన్స్ భీమేశ్వరా క్లబ్'

సామర్లకోట, జూలై 22: సమాజ అవసరాలు సత్వరం గుర్తించి పరిష్కరించే సేవా గుణాలు కలిగిన సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ జిల్లాలోనే ముందంజలో ఉందని లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌ల ప్రతినిధి వి.విజయకుమార రాజు పేర్కొన్నారు. సామర్లకోటకు చెందిన లయన్స్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించి లయన్స్ జిల్లా గవర్నర్‌గా ఈదర ఈశ్వరకుమార్ సేవాలాస్యం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయకుమార రాజు హాజరయ్యారు. లయన్స్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం డాక్టర్ బాదం బాలకృష్ణ, చిట్నీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈశ్వర్‌కుమార్ దంపతులను లయన్స్ ప్రతినిధులు సత్కరించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు భద్రత పెంచాలి : వర్మ

పిఠాపురం, జూలై 22: జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు భద్రత పెంచాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. పవన్ భద్రతకు ముప్పు ఉందని కేంద్ర నిఘావర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ఆయన రాష్ట్రంలో, నియోజకవర్గంలో పర్యటించే సమయంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పవన్‌కు మరింత భద్రత కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌ను సద్వినియోగం చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), జూలై 22: కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామ పంచాయతీ 2006-2011 కాలంలో నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు ద్వారా సాధించిన రూ.5లక్షల కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌ను సద్వినియోగం చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ పలివెల వీరబాబు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా పంచాయతీ అధికారి సౌజన్యకు తెలిపారు. అవార్డు నిధుల సొమ్ము పోకుండా కాపాడాలని కోరారు.

'బీజేపీని మరింత పటిష్టపరచాలి'

పెద్దాపురం, జూలై 22: క్షేత్రస్థాయిలో బీజేపీని మరింతగా పటిష్టపరచాలని నియోజకవర్గ కన్వీనర్ కొక్కిలగడ్డ గంగరాజు అన్నారు. స్థానిక తాళ్లూరివారి సత్రంలో సోమవారం బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం మరింతగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. బీజేపీ నేతలు తుమ్మల పద్మజ, అల్లు ప్రసాద్, చెరుకూరి రవికృష్ణ పాల్గొన్నారు.

'ఉచితంగా విత్తనాలను అందివ్వాలి'

తాళ్లరేవు, జూలై 22: ప్రభుత్వం రైతులకు ఉచితంగా విత్తనాలను అందివ్వాలని కౌలురైతు జిల్లాసంఘం కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వరినాట్లు మునిగిపోయి పాడయ్యాయని, ఎదలు పోగడిపోయాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు విత్తనాలను ఉచితంగా అందిస్తే మళ్లీ రైతులు నాట్లు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

నేటి నుంచి ఆధార్ గ్రామసభలు

ప్రత్తిపాడు, జూలై 22: ప్రత్తిపాడు మండలంలో నూతనంగా ఆధార్ నమోదు, చేర్పులు, మార్పులు వంటి వాటి కోసం ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డేవిడ్ రాజు సోమవారం తెలిపారు. ఒమ్మంగి పంచాయతీ కార్యాలయం వద్ద, పోతులూరు పంచాయతీ, ధర్మవరం, ప్రత్తిపాడు సచివాలయం1 వద్ద 23,24న... లంపకలోవ, చింతలూరు, ధర్మవరం జడ్పీహెచ్ఎస్, ప్రత్తిపాడు సచివాలయ 2 వద్ద 25,26న... ఉత్తరకంచి, యజ్జేపురం, ధర్మవరం సచివాలయం 3 వద్ద 27న ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

28న టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం

తాళ్లరేవు, జూలై 22: టీడీపీ ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం తాళ్లరేవు సూర్యభాస్కర కల్యాణ మండపంలో ఈనెల 28న జరుగనున్నట్టు టీడీపీ నేత టేకుమూడి లక్ష్మణరావు తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి శుభాష్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌లను సన్మానించే కార్యక్రమంపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో చర్చించారు. జనసేన నేత అత్తిలి బాబూరావు, ముత్యాల జయలక్ష్మి, నూరంపూడి కుమార్, బీజేపీ నేత కొపనాతి దత్తాత్రేయవర్మ, టీడీపీ నేతలు మోపూరి వెంకటేశ్వరరావు, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, జక్కుల ప్రసాద్‌బాబు, పెమ్మాడి కృష్ణవేణి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

తొండంగి, జూలై 22: ఏవినగరంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామికి పంచామృతాభిషేకం అనంతరం అర్చకులు స్వామి, అమ్మవార్లను ఉన్నత వేదికపై ఆశీనులను చేసి కల్యాణానికి శ్రీకారం చుట్టారు. శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పాల్గొని ప ట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు వెంకన్న, శ్రీను తేజ పూజా కార్యక్రమాలు నిర్వహించగా కొంగర విశాలాక్షి, అరిగెల నర్సింహమూర్తి, యనమల నాగేశ్వర్రావు తదితరులున్నారు.

భక్తులకు కూరగాయల ప్రసాదం వితరణ

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 22: నగరంలో ప్రసిద్ధి చెందిన బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు కూరగాయల ప్రసాదం వితరణ చేశారు. అన్నదాన మండపంలో నిర్వహించిన ప్రసాదం వితరణలో ఈవో సీహెచ్‌వీ భాస్కరరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు గ్రంధి బాబ్జి,అధికంగా భక్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

» జిల్లాలో స్వచ్ఛతా వారోత్సవాలు

» అవగాహన ర్యాలీలు

» పాల్గొన్న నాయకులు, అధికారులు





సర్పవరం జంక్షన్: ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్డీవో, గొల్లప్రోలు రూరల్: చేబ్రోలులో ర్యాలీలో మెప్మా పీడీ

సర్పవరం జంక్షన్, జూలై 22: సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు నిల్వనీరు లేకుండా చేయాలని డీఎల్డీవో, ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ పాటంశెట్టి నారాయణమూర్తి కోరారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం రమణయ్యపేటలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో వారం పాటు శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోడ్డుపక్కన ఉన్న చెత్తా, వ్యర్థాల తొలగింపు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక తీత తొలగించారు. అనంతరం గ్రామస్థులు, పంచాయతీ సిబ్బందితో కలసి స్వచ్ఛ సంకల్ప ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జొన్నాడ నరసింహనావు, జనసేన నాయకులు తాటికాయల వీరబాబు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు. 2వ డివిజన్, 47వ డివిజన్‌లో వార్డు సచివాలయాల సిబ్బందితో కలసి జనసేన పార్టీ 2వ డివిజన్ అధ్యక్షులు గోపు వెంకటరమణ, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ నాగశాస్త్రి, నోడల్ అధికారి రమేష్, అడ్మిన్స్ సూరిబాబు, దుగ్గన మణికంఠ, ప్రశాంతి, కూటమి నాయకులు జేవీవీ సత్యనారాయణ, ముగ్గుళ్ల బాబూరావు, ఇంటి రాజేష్, దాది మధు, రమణ ఉన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ): పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాకినాడలో స్వచ్ఛతా వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ పి.తిప్పేనాయక్, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, అధికారులు, విద్యార్థులు, మెప్మా సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద శ్రమదానం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతినెలా చివరి వారంలో సోమవారం నుంచి శనివారం వరకు వారం రోజుల పాటు స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పరిశుభ్రతతో పాటు భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇళ్లవద్ద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీచరణ్, ఈఈ మాధవి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశాల మేరకు పలు డివిజన్లలో కూటమి శ్రేణులు స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు జరిపారు. అవగాహన ర్యాలీలు జరిపి జనావాస ప్రాంతాలు, పార్కులు, పాఠశాలలు, కళాశాలల ఆవరణలలో చెత్త వ్యర్థాలను తొలగించారు. 36వ డివిజన్‌లో నిర్వహించిన ర్యాలీకి టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, జనసేన డివిజన్ ఇన్‌చార్జి సుంకర సురేష్, బీజేపీ మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యం వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లూరి తులసి, ఆకెళ్ల ప్రసాద్, సత్యంశెట్టి రాజేష్, వల్లభుని శ్రీనివాస్ పాల్గొన్నారు. 10వ డివిజన్‌లో టీడీపీ, జనసేన నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుమ్ములపేట పార్కులో పనులు మొదలు పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చోడిపిల్లి సతీష్, మూగు రాజు, మోసా విజయ్ పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు ప్రియంవద తెలిపారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్వహించిన ర్యాలీలో ఆమెతో పాటు ఎంపీడీవో జయప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జనసేన నాయకుడు ఓదూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. దుర్గాడలో ర్యాలీలో ఉపసర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్.. తాటిపర్తిలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్వచ్ఛత వారోత్సవాలను పెద్దనాపల్లి గ్రామంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి విద్యార్థులతో కలిసి ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలో ప్రత్యేక అధికారి మల్లికార్జునరావు మెయిన్‌రోడ్డులో నగర పంచాయితీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. భద్రవరం గ్రామంలో నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జిగటాపు సూరిబాబు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతపై ర్యాలీ చేశారు

అన్నవరం: గ్రామంలో స్వచ్ఛతా వారోత్సవాలను మాజీ సర్పంచ్ రాజాల చిట్టిబాబు ప్రారంభించారు. పంచాయితీ సిబ్బంది, అంగన్‌వాడీ, వైద్యఆరోగ్య సిబ్బంది, కార్యదర్శి రామకృష్ణ, సర్పంచ్ కుమార్‌రాజా, టీడీపీ నాయకులు మెరపల నరసయ్య పసుపులేటి చక్రి, కడుపుకుట్ల కృష్ణ,బండారు సురేష్ పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో పంచాయతీ కార్యదర్శి రాజన్న ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో వసంత్‌కుమార్‌తో కలిసి పంచాయతీ, శానిటరీ సిబ్బంది వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.రమణి, పీఎస్ వత్సవాయి రాజంరాజు, ఎంఈవో2 ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, హెచ్ఎం రంగారావు, ఏపీఎంజగదీశ్వరి పాల్గొన్నారు.

సామర్లకోట: మండలంలో వేట్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హుస్సేన్‌పురం, పవరలో వైద్య, ఇతర సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. మండల ఈవోపీఆర్డీ హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీడీపీ నాయకులు చల్లా బుజ్జి పాల్గొన్నారు. పవరలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

పిఠాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పిస్తూ పిఠాపురంలో ర్యాలీ నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కమిషనరు కనకారావు తదితరులున్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ర్యాలీ ప్రారంభించారు. చినశంకర్లపూడిలో టీడీపీ నాయకుడు మిరియాల శ్రీను, విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. ఉత్తరకంచిలో సర్పంచ్ మంతెన శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, బొండాడ నారాయణ, బొల్లు వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దానం శేషారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి,వాకతిప్ప గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలను కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ ప్రారంభించారు. కుతుకుడుమిల్లిలో వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్‌లు గవర భవానీ నాగేశ్వరరావు, పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు, ఈవోపీఆర్డీ ఎంఎస్ భాస్కర్, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండల గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, ఈగల సత్తిబాబు, పసగడుగుల రమణ, ఉండ్రాజు దివాణం, ఎంపీటీసీ సోమరౌతు రవి, పల్లికుమార్, వాసిరెడ్డి భాస్కరావు పాల్గొన్నారు.

పెద్దాపురం: పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు. ర్యాలీ పలు ప్రధాన వీధుల గుండా సాగింది. మున్సిపల్ కమిషనర్ కేవీ.పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, టీడీపీ నేతలు తూతిక రాజు, అనివిళ్ల శాస్త్రి, సకురు ప్రసాద్, కొరిపూరి రాజు తదితరులున్నారు

తాళ్లరేవు: తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు, కోరింగ, పటవల, జి.వేమవరం, చొల్లంగిపేట, చొల్లంగి, జార్జీపేట, నీలపల్లి, సుంకరపాలెం, ఇంజరం, ఉప్పంగల, లచ్చిపాలెం, గోవలంక, పిల్లంక, గాడిమొగ గ్రామాల్లో స్వచ్ఛతా ర్యాలీలను నిర్వహించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, గంజా సూరిబాబు, పల్లి సత్తిబాబు, మల్లాడి సీతారామరాజు, కట్టా త్రిమూర్తులు, బజన సత్తిబాబు, దూళిపూడి వెంకటరమణ, కాట్రు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

గండేపల్లి: మురారి గ్రామంలో వైద్య సిబ్బంది, అధికారులు ర్యాలీ నిర్వహించారు. నీలాద్రిరావుపేట గ్రామంలో స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు జాస్తి వసంత్, సర్పంచ్ కుక్కల ఆనందబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: మండల గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహించారు. పంచాయతీ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు చేశారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కిర్తిసుభాస్ పాల్గొన్నారు.


కండి కాలువను పరిశీలించిన తుమ్మలపల్లి రమేష్



కండి కాలువను పరిశీలిస్తున్న తుమ్మలపల్లి

గండేపల్లి, జూలై 22: మండలంలోని జడ్.రాగంపేటలో కండి కాలువను జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సోమవారం పరిశీలించి రైతులు, స్థానికులతో చర్చించారు. రమేష్ మాట్లాడుతూ జడ్.రాగంపేట నుంచి నాయకంపల్లి, సూరంపాలెం తదితర గ్రామాలకు, చుట్టుపక్కల పొలాలకు ఈదారి గుండా వెళ్తారని, ప్రతీ వర్షాకాలంలో ఈ కండి కాలువ పొంగిపొర్లుతుందన్నారు. ఈ రోడ్డుగుండా వెళ్లేందుకు వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌తో మాట్లాడతానని ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు.

వరద ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన



కొత్తలంకలో పర్యటిస్తున్న ఆర్డీవో కిషోర్

తాళ్లరేవు, జూలై 22: పిల్లంక గ్రామ పంచాయతీ కొత్తలంక వరద ప్రభావిత ప్రాంతాల్లో కాకినాడ ఆర్డీవో కిషోర్ సోమవారం పర్యటించారు. గోదావరి వరద హెచ్చరికల నేపథ్యంలో గ్రామంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. ముందస్తుగా పశువులకు దాణా తాగునీరు, ఆహారం వైద్యబృందాలు, గజ ఈతగాళ్లు, రవాణా పడవలు, అత్యవసర సామగ్రిని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఈ మారుతీరావు, ఏడీ బ్రహ్మవేద, ఈవోపీఆర్డీ భైరవమూర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంపులో రహదారులు

పిఠాపురం రూరల్, జూలై 22: ఎడతెరిపి వర్షాలతో పిఠాపురం మండలం విరవ జగనన్న కాలనీ రహదారులు ముంపునకు గురయ్యాయి. పలు రోడ్లపై నీరు నిలిచిపోగా మిగిలిన రహదారులు బురదమయంగా మారాయి. కాలనీలో డ్రెయిన్లు లేవని, నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో చిన్న వర్షం కురిసినా నీరు నిలిచిపోతున్నదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



విరవ జగనన్న కాలనీలో రహదారిపై వర్షపు నీరు

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

జడ్జి, ఆర్డీవో, డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భాను

ప్రత్తిపాడు, జూలై 22: రహదారి భద్రతా నియమ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని ప్రత్తిపాడు జడ్జి కాటం భాను, పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, డీఎస్పీ లతాకుమారి కోరారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం రహదారి భద్రత హెల్మెట్ ధారణ, ఆవశ్యకతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రహదారులపై ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోవడంవల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు సంభవించినా హెల్మెట్ కారణంగా సురక్షితంగా ప్రాణాలతో బయటపడవచ్చని తెలిపారు. చిన్నకార్లు,ఇతర వాహనాల్లో డ్రైవర్లు సీటు బెల్ట్ ధరించాలన్నారు. రహదారులపై నిబంధనలు వివరిస్తూ హెచ్చరిక బోర్డులు గమనించి వాహనదారులు సురక్షిత ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. న్యాయవాదులు బుగతా శివ, వి.మధుబాబు, అవసరాల దేవి, మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం అందిస్తాం : కమిషనర్



ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22: ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతిఒక్క సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు హామీ ఇచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. ప్రజలు ఫోన్ ద్వారా తెలిపిన సమస్యలను కమిషనర్ స్వీకరించారు. 11మంది తమ సమస్యలను వివరించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవి పాల్గొన్నారు.



శాకంబరిగా పర్వతవర్ధినీదేవి

కరప, జూలై 22: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పర్వతవర్ధినీదేవిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈవో కె.తిరుమలరవితేజ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖ డీసీ విజయరాజు కరప శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

నవోదయాలో శిక్షాసప్త కార్యక్రమం

పెద్దాపురం, జూలై 22: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం శిక్షా సప్త కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి రోజు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ డే, రెండవ రోజు ఫన్ డే, మూడవ రోజు గేమ్స్ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ననపల సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుధీర్ కుమార్, చక్రవర్తి, అల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ బురదమయం!

గండేపల్లి, జూలై 22: ఎడతెరిపిలేకుండా వర్షాలకు మల్లేపల్లి కాలనీలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వాటిపై నడవాలంటే కాలనీవాసులు నరకయాతన పడుతున్నారు.



మల్లేపల్లిలో అధ్వానంగా ఉన్న రోడ్డు

'పంపా' నుంచి నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

అన్నవరం, జూలై 22: మెట్టప్రాంత రైతుల జలప్రదాయని అయిన పంపా రిజర్వాయర్‌కు గడిచిన 3రోజులుగా కురుస్తున్న వర్షాలతో క్రమేపి నీటిమట్టం పెరుగుతుంది. దీంతో రైతుల అభ్యర్థన మేరకు ఖరీఫ్‌కు జలాశయం నుంచి సోమవారం పంపానీటిని తుని టీడీపీ నాయకులు యనమల రాజేష్, పర్వత సురేష్ టెంకాయి కొట్టి విడుదల చేశారు. ప్రస్తుతం పంపానీటి మట్టం 95.6 అడుగులండగా ఎగువ ప్రాంతాల నుంచి రోజుకు 100 క్యూసెక్కుల నీరు చేరుతుందని, ప్రస్తుతం పంటపొలాలకు 20 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నామని, రైతుల అవసరమైతే మరింత పెంచుతామని ఇరిగేషన్ ఈఈ శేషగిరి తెలిపారు. నాయకులు బద్ది రామారావు, పంపా ఇరిగేషన్ అధికారిణి శ్రీదేవి పాల్గొన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్



పేదలకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 22: ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం గండేపల్లికి చెందిన చాగంటి వెంకట గోపాలకృష్ణ మోహన్ ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. జగ్గంపేట టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం ముఖ్య అతిథిగా హాజరై బొల్లంరెడ్డి రామకృష్ణతో కలిసి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, వేములకొండ జోగారావు, బస్వా చినబాబు, చిటికెల కన్నబబు, కంటిపడి సూరిబాబు, యల్లమిల్లి సీఎం, రాయి సాయి, ఎండీ కాజా, ప్రేమ స్వరూప్ బుజ్జి, నల్లమాటి ఆనంద్,ముక్కపాలు బాబు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే దివ్య



తుని రూరల్, జూలై 22: రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని విజయవాడలో శాసన సభ సమావేశాల సందర్భంగా సోమవారం తుని ఎమ్మెల్యే యనమల దివ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

ముంపు పొలాల పరిశీలన



యండమూరులో రైతులకు సూచనలిస్తున్న జేడీఏ

కరప, జూలై 22: మండలంలోని ఆయా గ్రామాల్లో ముంపుకు గురైన పొలాలను సోమవారం జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎన్.విజయ్‌కుమార్ పరిశీలించారు. రైతులతో సమావేశమై పొలాల సస్యరక్షణ చర్యలను వివరించారు. ఏడీఏ కె.బాబూరావు, ఏవో అప్పసాని వెంకటరాజేష్, సర్పంచ్ మారెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్ఎంటీలకు శిక్షణా తరగతులు

సామర్లకోట, జూలై 22: సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో 8జిల్లాలకు చెంది డీఎల్ఎంటీలకు ఇస్తున్న శిక్షణా తరగతులు రెండో బ్యాచ్ సోమవారం ప్రారంభించారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిక్షణా తరగతులను ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు శ్రీదేవి, నీహారిక, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆంజనేయులు తదితర శిక్షణార్థులు 70మంది పాల్గొన్నారు.

అయోధ్య, కాశీకి టీడీపీ మహిళలు

తాళ్లరేవు, జూలై 22: ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించునందుకు తాళ్లరేవు మండల టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, మోకా కస్తూరి ఆధ్వర్యంలో టీడీపీ మహిళలు అయోధ్య కాశీ యాత్రకు వెళ్లారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ విజయంసాధిస్తే కాశీయాత్రకి వస్తామని మహిళలు మొక్కుకున్నారు. అయోధ్య, కాశీ వెళ్లి మొక్కులను తీర్చుకుని తిరిగి తాళ్లరేవు మండలం పనయమయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అభినందనలు తెలియజేశారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

తొండంగి, జూలై 22: పెరువాళ్ళపురం డిగ్రీ కళాశాలలో జువాలజీ, ఎకనమిక్స్‌లలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ తెలిపారు. సంబంధిత పీజీ సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు ఉండడంతో పాటు ఎంఫిల్, పీహెచ్‌డి కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ వారికి 50 శాతం మార్కులు ఉండాలన్నారు. ఈ నెల 30 సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను తమ కార్యాలయానికి పంపాలన్నారు.

పత్తి, వరినాట్ల పరిశీలన

శంఖవరం, జూలై 22: పత్తిసాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యసాయాధికారి పి.గాంధీ అన్నారు. కత్తిపూడి, శంఖవరంలో పత్తి, వరినాట్లను పరిశీలించారు. వర్షాలకు పత్తిపొలంలో నిల్వ ఉన్న నీరు బయటకు పోయేటట్టు చూడాలని, 3 గ్రాములు కాపర్, ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి మొదలుతడిచేటట్టు పిచికారీ చేయాలన్నారు.

కుక్కల బెడద!

జగ్గంపేట, జూలై 22: జగ్గంపేట శివాలయం వీధి, రెడ్ కాన్వెంట్ పరిసర ప్రాంతాల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. కుక్కలు ఏ క్షణాన దాడి చేస్తాయోనని ప్రజలు, పిల్లలు భయపడుతున్నారు.